శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7 కనిష్ఠం 20.8

రాత్రివేళ చిటపట చినుకులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి చినుకులు పడ్డాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. కాగా, గత రెండ్రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల నుంచి 12 డిగ్రీలకు పడిపోతున్నాయని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం కారణంగా మరో రెండ్రోజుల పాటు నగరమంతటా ఇదే తరహా వాతావరణం ఉండే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

పద్దు మీరుతోంది..

పైసా నిధులివ్వరు..రూ.వేల కోట్లతో బడ్జెటా ?

- సమస్యలు పరిష్కరించకుంటే ప్రజలకు ఏం చెప్పాలె ?
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ప్రశ్నలు
- ప్రతిపాదనల ఆధారంగా నిధులివ్వట్లేదని ఆక్షేపణ
- ముసాయిదా బడ్జెట్ ఆమోదం వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'రూ.8 వేల కోట్లకు పైగా ప్రతిపాదనలతో బడ్జెట్ ముసాయిదా రూపొందించారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదు. నిధులు లేకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం. బడ్జెట్ వాస్తవాలకు అనుగుణంగా ఉండాలి.. నియోజకవర్గాల వారీగా ఎన్ని నిధులు కేటాయిస్తారో పద్దులో స్పష్టంగా పొందుపర్చండి' అని స్టాండింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బడ్జెట్ కాపీని రెండురోజుల ముందు పంపారని, మార్పులు చేర్పులున్నాయంటూ నిన్న రాత్రి పంపిస్తే ఎలా చర్చించాలని నిలదీశారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ పద్దు (రివైజ్డ్ బడ్జెట్), 2025-26 అంచనా బడ్జెట్‌పై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా బడ్జెట్‌పై పలువురు సభ్యులు ఆక్షేపించారు. 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించి పలు అంశాల్లోని ప్రతిపాదనలు వాస్తవంగా లేవని..ఎస్టేట్, ప్రకటనల బడ్జెట్ ఆదాయం తక్కువ చూపించారని ఆరోపించారు. వేలకోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ నియోజకవర్గాల వారీగా సరిగా నిధులు ఇవ్వడం లేదని, అసలు మాకెన్ని నిధులు ఇస్తారు, గతంలో ఎన్ని ఇచ్చారనే దానిపై పూర్తి వివరాలు కావాలని డిమాండ్ చేశారు. కాగా, వాటర్ హార్వెస్టింగ్ అంటూ బడ్జెట్‌లో రూ.72 కోట్లు కేటాయించారని, అసలు ఎక్కడ కడుతున్నారో తెలియదనగా, ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్లను నిర్మిస్తున్నట్లు అధికారులు వివరించారు.

ప్రకటనల విభాగం ఆదాయంపై నిలదీత

గ్రీన్ బడ్జెట్ కోసం రూ.412 కోట్లు కేటాయిస్తున్నట్లు చూపించారని, అసలు మొక్కలు నాటేందుకు నగరంలో సరిపడా స్థలం లేదని, పంపిణీకి ఇంత మొత్తంలో కేటాయింపులు ఏమిటని స్టాండింగ్ కమిటీ సభ్యురాలు మన్నె కవిత అధికారులను ప్రశ్నించారు. శ్మశానవాటికలు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. ప్రభుత్వ ఆదాయంపై ఆధారపడకుండా జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. కాగా, పట్టణ ప్రణాళిక విభాగం ఆదాయం ఇప్పటివరకు రూ.425 కోట్లు మాత్రమే వచ్చిందని, బడ్జెట్‌లో రూ.1000 కోట్లు అని ఎందుకు చూపించారని మరో సభ్యురాలు విజయశాంతిరెడ్డి ప్రశ్నించారు. ప్రకటనల విభాగం నుంచి ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అందుకు తగినట్లు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాగా, స్టాండింగ్ కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానమిచ్చినప్పటికీ వారు అంగీకరించకపోవడంతో వాయిదాపడింది.

డిసెంబరు 9 తర్వాత సమావేశం : మేయర్


బడ్జెట్‌పై చర్చించేందుకు తమకు సమయం ఇవ్వాలని సభ్యులు కోరడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. కౌన్సిల్ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకొని బడ్జెట్ ప్రతిపాదనలో మార్పులు చేసి తిరిగి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సమావేశం ఈనెల 9 తర్వాత నిర్వహిస్తామని చెప్పారు. కమిషనర్ ఇలంబర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్లకార్డుల నిరసన



జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగంలో రూ.500 కోట్ల అవినీతి జరిగిందని చెప్పినా ఇప్పటివరకు ఎందుకు విచారణ చేపట్టలేదంటూ బీజేపీ కార్పొరేటర్లు ప్రశ్నించారు. స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఆ పార్టీ కార్పొరేటర్లు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడారు. 'ప్రకటనల విభాగంలో పదేళ్ల క్రితం వచ్చిన రెండు కంపెనీలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డాయి. స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలంటే అధికార పక్షం భయపడుతోంది. గతంలో బీఆర్ఎస్‌తో జతకట్టిన ఎంఐఎం, నేడు కాంగ్రెస్‌తో దోస్తీ చేస్తూ నిధులు కొల్లగొడుతోంది. కమిషనర్లుగా గ్రేటర్‌పై పూర్తి అవగాహన రాకముందే మార్చుతున్నారు' అని ఆరోపించారు.

'తిండి కలిగితే కండ కలదోయ్' అన్నట్లు.. సైకిల్ తొక్కితే ఆరోగ్యం మేలోయ్ అని సూచిస్తున్నారు వైద్యనిపుణులు. ఆధునిక కాలంలో సైకిల్ వాడకం క్రమంగా తగ్గుతుండడం.. రయ్‌రయ్‌మంటూ బైకులు పరుగులు తీస్తుండడం పర్యావరణం, ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదంటున్నారు. చాలామందికి సైకిల్ తొక్కాలని ఉన్నా ఎవరేమనుకుంటారోనన్న చిన్న ఆందోళన వారిని వెనక్కి లాగేలా చేస్తోంది. అది కేవలం చిన్నపిల్లలకేనన్న భావన నాటుకొని చక్కటి వ్యాయామాన్ని స్వయంగా దూరం చేసుకుంటున్నారు.



సైకిల్.. తొక్కితే లాభాల్

Sunday Special

శారీరక, మానసిక దృఢత్వానికి శ్రేయస్కరం

- గుండె, కాళ్ల కండరాలు పటుత్వం
- ఆందోళన, ఒత్తిడి తగ్గి చక్కటి నిద్రకు అవకాశం
- వ్యాధి నిరోధక శక్తి పెంపునకు దోహదం
- పర్యావరణ పరిరక్షణకూ ఎంతో ఉపయుక్తం

అల్వాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో వాహనాల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడంతో కాలుష్యం కూడా అదేస్థాయిలో పెచ్చరిల్లుతోంది. విద్య, వ్యాపారం, ఉద్యోగం వివిధ ఒత్తిళ్లతో చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. మరికొందరు మానసిక రుగ్మలతో సతమతమవుతున్నారు. దీన్నుంచి బయటపడేందుకు చాలా మార్గాలున్నా ఉపయోగించుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. చక్కటి ఆరోగ్యానికి వ్యాయామంతో పాటు సైకిల్ తొక్కడం ఎంతో మేలు. మారుతున్న కాలంలో సైకిల్ వినియోగం క్రమంగా తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

వాయుకాలుష్యంతో అనారోగ్య సమస్యలు

వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా వాయుకాలుష్యం ప్రమాదకరస్థాయిలో పెరుగుతోంది. దీనివల్ల భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తప్పవని పర్యావరణ నిపుణులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఇతర దేశాల్లో వాయుకాలుష్యం కట్టడికి అక్కడి ప్రభుత్వాలు కఠిన నిబంధనలను అమలు చేస్తున్నాయి. అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, జపాన్, చైనా

మిగతా 8వ పేజీలో..

మిలటరీ అధికారుల సైకిల్ యాత్రలు

రక్షణశాఖకు సంబంధించిన త్రివిధ దళాల అధికారులు తరచూ సైకిల్ యాత్రలను చేపడతారు. యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత పెంపొందించడానికి ఈ యాత్రలను నిర్వహిస్తుంటారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు, కాశీ నుంచి కన్యాకుమారి వరకు వీటిని చేపడతారు. మిలటరీ అధికారులు ఫిట్‌నెస్ కోసం రోజూ సైక్లింగ్ చేస్తారు.



సైక్లింగ్ వల్ల లాభాలు

- నిత్యం సైకిల్ తొక్కడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.
- కాలిపిక్కల కండరాలు బలంగా తయారవుతాయి.
- ఆరోగ్యం మెరుగుపడి జీవితకాలం పెరుగుతుంది.
- మానసిక ఆందోళన దూరమై మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- గుండెపోటు రాకుండా కాపాడుతుంది. కండరాల పటుత్వం మెరుగవుతుంది.
- శరీరంలో రోగనిరోధకశక్తి పెంపునకు దోహదం చేస్తుంది.
- 30 నిమిషాలు సైక్లింగ్ చేస్తే 298 క్యాలరీలు ఖర్చవుతాయి.
- ఆందోళన, ఒత్తిడి తగ్గి సుఖవంతమైన నిద్రకు దోహదం చేస్తుంది.



అధికారులకు సర్వే వివరాలు అందజేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

సర్వేలో సమగ్ర వివరాలు నమోదు చేయించుకోవాలి

- మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో హైదరాబాద్ నగరంలోని కుటుంబాలన్నీ పాల్గొని తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. సమగ్ర కుటుంబసర్వేలో భాగంగా జీహెచ్ఎంసీ అధికారుల బృందం శనివారం శాస్త్రిపురంలోని ఒవైసీ నివాసంలో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ సర్వేలో అధికారులకు సమగ్ర సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో ఆయా వర్గాలకు సంక్షేమ పథకాల వర్తింపు, పిల్లల చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్వేలో సరైన వివరాలు నమోదు కాని పక్షంలో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ప్రయోజనం పొందలేకపోతామనే విషయాన్ని గుర్తించాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం అధికారుల ద్వారా సర్వే తీరుతెన్నులను ఒవైసీ ఆరాతీశారు.

గృహజ్యోతి లబ్ధిదారులు 10.5 లక్షలు



- ఎనిమిది నెలల్లో 20.71 శాతం పెరుగుదల
- సంగారెడ్డి సర్కిల్‌లో అత్యధికంగా 2.13 లక్షలు
- రాజేంద్రనగర్‌లో 1.33 లక్షలు
- అత్యల్పంగా బంజారాహిల్స్ సర్కిల్‌లో 36 వేలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు కలిగివుండి నెలకు 200 యూనిట్ల కరెంటు వినియోగిస్తున్న 'గృహజ్యోతి' లబ్ధిదారుల సంఖ్య గ్రేటర్‌లో క్రమంగా పెరుగుతోంది. ఈ పథకం ప్రారంభమైన మార్చి మాసంలో పది సర్కిళ్లలో 8.71 లక్షల మంది జీరో బిల్లులు పొందగా.. నవంబరులో 10.52 లక్షల మంది ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. మరో 2-3 లక్షలమంది జీరో బిల్లులకు అర్హత ఉన్నా 200 యూనిట్లకు పైగా విద్యుత్ వాడుతుండటంతో వారికి విద్యుత్‌శాఖ సాధారణ బిల్లులు జారీ చేస్తోంది. గ్రేటర్ పరిధిలో గృహజ్యోతి పథకానికి మొత్తం 21 లక్షలమంది దరఖాస్తు చేసుకోగా వారిలో ఇప్పటివరకు 10.5 లక్షల మంది లబ్ధిపొందారు. పది సర్కిళ్లలో అత్యధికంగా సంగారెడ్డి సర్కిల్‌లో 2.13 లక్షలమంది గృహజ్యోతి లబ్ధిదారులుండగా రాజేంద్రనగర్‌లో 1.33 లక్షలు, హబ్సిగూడ సర్కిల్‌లో 1.28 లక్షలు, మేడ్చల్ సర్కిల్‌లో

మిగతా 8వ పేజీలో..

ప్రతినెలా రూ.100 కోట్లు

గ్రేటర్‌లో ప్రతినెలా 10 లక్షల మంది విద్యుత్ వినియోగదారులు సుమారు రూ.100 కోట్ల వరకు గృహజ్యోతి పథకంతో లబ్ధిపొందుతున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రతి నెలా 200 యూనిట్లకు వచ్చే బిల్లు సుమారు రూ.1150- 1200 వరకు ఉంటుంది. వాటిలో ఎనర్జీ, కస్టమర్ చార్జీలతోపాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ఇతర చార్జీలు ఉంటాయి. గృహజ్యోతి పథకం ప్రారంభమైనప్పటి నుంచి నవంబరు ఆఖరు వరకు 94.71 లక్షల మంది జీరో బిల్లులు పొందారు. చలికాలం కరెంటు వినియోగం కాస్త తగ్గడంతో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య కొంత పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

విద్యాశాఖ లీకులపై కలెక్టర్ సీరియస్ !
8
డ్రగ్స్ వినియోగంపై కన్నేయండి
● సందీప్‌కుమార్ శాండిల్య



ఫ్యాషన్.. మెరిసెన్

ఓ ప్రముఖ పర్‌ఫ్యూమ్ సంస్థ క్రిజలీస్ పేరుతో గోల్కొండలోని తారామతి బారాదరిలో ఫ్యాషన్ షో నిర్వహించింది. వెటరన్ క్రికెటర్ జహీర్‌ఖాన్, నటులు నాగచైతన్య, నవదీప్ తదితరులు ర్యాంప్‌వాక్ చేసి అలరించారు.

రెండు ఎల్‌ఈడీ స్ర్కీన్లకు పన్ను మినహాయింపు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసే ఎల్‌ఈడీ స్ర్కీన్లకు పన్ను మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం జీహెచ్ఎంసీకి చెందిన వివిధ అంశాల వారీగా నాలుగు ఉత్తర్వులు వచ్చాయి. అందులో భారత వాతావరణశాఖ ఏఏఐ కాలనీ వద్ద మెట్రో పిల్లర్‌కు స్టాటిస్టిక్స్‌తో కూడిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌కు జీహెచ్ఎంసీకి ప్రకటన రుసుం చెల్లించకుండా మినహాయింపునిచ్చింది. భాషా సాంస్కృతిక శాఖ రవీంద్రభారతి ప్రహరీకి ఏర్పాటు చేసే ఎల్‌ఈడీ స్ర్కీన్‌కు కూడా పన్ను మినహాయింపునిస్తూ రెండు ఉత్తర్వులు వచ్చాయి. అలాగే ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-1లో భాగంగా రూ.2.99కోట్లతో సరూర్‌నగర్ పెద్దచెరువు తూము పునరుద్ధరణ, బేగంపేట ఆర్వోబీకి రూ.20 కోట్లతో మరమ్మతు చేపట్టేందుకు జీహెచ్ఎంసీకి పాలనాపరమైన అనుమతులిస్తూ మరో జీవోను జారీచేశారు.

గుర్తింపే లేదు.. సర్టిఫికెట్లు ఎలా?

పేరుకే పరిమితమైన కోఠి మహిళా యూనివర్సిటీ

- బీఆర్ఎస్ హయాంలో వర్సిటీ ఏర్పాటు
- అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించని ఫలితం
- వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరుపెట్టిన రేవంత్ సర్కారు
- సర్టిఫికెట్ల జారీకి అంగీకరించని ఉస్మానియా

హైదరాబాద్ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ఏర్పాటైన కోఠి మహిళా యూనివర్సిటీకి ఇప్పటికీ యూజీసీ గుర్తింపు రాకపోవడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. పీజీ, వచ్చే ఏడాది డిగ్రీ పూర్తయ్యే వారికి సర్టిఫికెట్ల జారీపై సందిగ్ధత నెలకొంది. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం.. 2022 ఏప్రిల్ 25న ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న కోఠి ఉమెన్స్ కాలేజీని మహిళా యూనివర్సిటీగా ప్రకటించింది. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా పేరు పెట్టింది. కానీ దానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లేదు. 2022-23 నుంచి తరగతులు ప్రారంభం కాగా ఎలాంటి అనుమతులు లేకుండానే రెండు విద్యాసంవత్సరాలు పూర్తయ్యాయి. మూడో

మిగతా 8వ పేజీలో..



కోఠిలోని మహిళా వర్సిటీ ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

యూజీసీలో చేర్చాలని ఆందోళన

అఫ్జల్‌గంజ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోఠి మహిళా విశ్వవిద్యాలయాన్ని వెంటనే యూజీసీలో చేర్చాలంటూ విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయంగా నామకరణం చేసి వదిలేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు మార్చిందన్నారు. కానీ, ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని.. డిగ్రీ పూర్తవుతున్న తరుణంలో ఏ ప్రాతిపదికన సర్టిఫికెట్లు ఇస్తారని పలువురు ప్రశ్నించారు. తమ భవిష్యత్తు అయోమయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని విశ్వవిద్యాలయాన్ని యూజీసీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో చలి కాస్త తగ్గింది. గత వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుండగా శుక్రవారం రాత్రి మాత్రం ఏకంగా ఐదారు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి.

క్షిపణుల తయారీలో భారత్ నంబర్ వన్

సాంకేతిక ప్రగతి, డీఆర్డీవోకు సహకారంలో నిట్ పాత్ర కీలకం

వరంగల్ నిట్ స్నాతకోత్సవంలో డీఆర్‌డీవో చైర్మన్ కామత్

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): క్షిపణుల తయారీ రంగంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ విభాగం అత్యంత శక్తిమంతంగా మారిందని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వీ కామత్ అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీ య ఇంజనీరింగ్ కాలేజీ స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. అగ్ని, పృథ్వీ, ఆకాశ్ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధవిమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాకలాంటి సాయుధ సంపత్తిని డీఆర్‌డీవోనే తయారు చేసిందన్నారు. వీటన్నింటి వల్లనే దేశ రక్షణ రంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకుంటూ ఉండాలని చెప్పారు. అంతకు ముందు కామత్ నిట్‌లో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ అధ్యక్షత వహించారు. నిట్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 1,875 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 10మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సారి నిట్ గోల్డ్ మెడల్ విజేతగా మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) నిలిచారు.

సరూర్‌నగర్ స్టేడియంలో 6న బీజేపీ భారీ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక?
బీఆర్ఎస్ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ కొలువులు
ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు
బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి
సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసనలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 6న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై ఆదివారం నుంచి బీజేపీ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపై ఆదివారం చార్జ్‌షీట్ విడుదల చేయనుంది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించనున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చింది తప్ప.. ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కారులు ఒక్క పైసా ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ కూడా అరకొరగా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోని అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏ వర్గమూ సంతోషంగా లేదని.. రాష్ట్ర ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమబాట పట్టాలని పార్టీ నాయకులకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలన స్ఫూర్తిగా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.

సభ్యత్వ నమోదుపై బన్సల్ క్లాస్..

బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 20వేల క్రియాశీల సభ్యత్వాలు అయ్యాయని.. ఇంకా 30 వేలు చేయించాల్సిందేనని స్పష్టం చేశారు. సభ్యత్వాలు చేయించని వారికి పార్టీ పదవులు ఎందుకని ప్రశ్నించారు. "సభ్యత్వ నమోదు మొదలు ప్రతీ పార్టీ కార్యక్రమాలకు తెలంగాణ నేతలు సడలింపులు కోరతారు. యూపీ కంటే ఇక్కడ కులపిచ్చి ఎక్కువ. అధికారంలోకి రావాలంటే సంస్థాగత బలోపేతం అత్యంత కీలకం. హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం" అని స్పష్టం చేశారు.



హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నమూనా

రూ.26 కోట్లతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వేస్టేషన్ ప్రతిపాదిత డిజైన్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పన వల్ల రైల్వే స్టేషన్ అత్యాధునిక రవాణా కేంద్రంగా మారుతుందని తెలిపారు.


వైసీపీ నేతల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

- ఏపీ మంత్రి లోకేష్ చొరవ.. సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట
- ఇతడి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న వికారాబాద్ వాసి
- అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులకు బాడుగకు
- సతీష్‌కు అద్దె చెల్లించని వికారాబాద్ యువకుడు మణిరాజ్
- అడిగినందుకు చంపేస్తేమని బెదిరింపులు.. చిత్రహింసలు
- ఏపీ ఆదేశాలతో స్వాధీనం చేసుకున్న తెలంగాణ పోలీసులు


బాధితుడు సతీష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నాడు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలల పాటు డబ్బు చెల్లించలేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిరాజ్‌ను ఓ మోసం కేసులో సైబరాబాద్ పరిధి జీడిమెట్ల పోలీసులు నిరుడు జూలై 5న అరెస్ట్ చేశారు. సతీష్ ఫిర్యాదుతో పీటీ వారెంట్‌పై సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని మణిరాజ్ తెలిపాడు. దీంతో సతీష్ వాహనాల గురించి వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిలు సతీష్‌ను తీవ్రంగా కొట్టారు. కార్లు అడిగితే చంపుతామని బెదిరించారు. ఇడుపుల పాయలోని గదిలో ఐదు రోజులు బంధించి చిత్రహింసలు పెట్టారు. చంపేందుకు కుట్ర పన్నారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. సోషల్ మీడియాలో ఏపీ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లాడు. జనసేన నేతలకు కూడా తెలిపాడు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు. కార్లను కోర్టులో ప్రవేశపెడతామని సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. 2021 నుంచి ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు తన కార్లను దౌర్జన్యంగా వాడుకున్నారని సతీష్ చెప్పాడు. వేంపల్లె పోలీసులు గతంలో వైసీపీ నేతలకే మద్దతు పలినట్టు ఆరోపించాడు. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వైసీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తన ప్రాణానికి ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

2 నుంచి సాయంకాలం బీటెక్ తరగతులు ప్రారంభం

- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సమాచారమిచ్చినట్టు చెప్పారు. ఈవెనింగ్ బీటెక్ అకడమిక్ క్యాలెండర్‌ను ఆయన శనివారం విడుదల చేశారు. వర్సిటీలోని మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ఈవెనింగ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 4వరకు మొదటి సెమిస్టర్ కొనసాగుతుందని, సెకండ్ సెమిస్టర్ జూన్ 2న ప్రారంభమై అక్టోబరు 18తో ముగుస్తుందన్నారు. సాయంకాలం బీటెక్ రెండో సంవత్సరం తరగతులను 2025 నవంబరు 3 నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

అప్పులు తీర్చలేక పత్తి రైతు ఆత్మహత్య

- సిరిసిల్ల జిల్లా జవారిపేటలో ఘటన

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించక పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన రైతు కోమటి నాగరాజు (49) తనకున్న 4 ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతీ ఏటా నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనతో శనివారం పొలంలో పురుగు మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.


ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులతో నగర సీపీ సీవీ ఆనంద్

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో గడించిన అనుభవం వృథా కాకుండా సమాజ హితానికి తోడ్పడాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో శనివారం పదవీ విరమణ పొందిన 12 మంది అధికారులను కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అధికారులను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో రిటైర్డ్ జీవితం ఆనందంగా గడపాలని కోరుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు సిబ్బందిని క్రైం డీసీపీ అరవింద్‌బాబు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

నేడు పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభ సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు పలు రహదారుల్లో దారి మళ్లింపులు ఉంటాయని, వాహనదారులు ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా, పోలీసులు సూచించిన మళ్లింపుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ మళ్లింపులు ఉండే ప్రాంతాలు..

పంజాగుట్ట-గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట, సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ వైపు వెళ్లే దారిలో అత్యధిక ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంటుంది. అలాగే టివోలీ ఎక్స్‌రోడ్ నుంచి ప్లాజా ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డును క్లోజ్ చేస్తారు. చిలకలగూడ ఎక్స్‌రోడ్డు, ఆలుగడ్డ బావి ఎక్స్‌రోడ్డు, సంగీత్ ఎక్స్‌రోడ్డు, వైఎంసీఏ ఎక్స్‌రోడ్డు, ప్యాట్నీ ఎక్స్‌రోడ్డు, ఎస్‌బీహెచ్ ఎక్స్‌రోడ్డు, ప్లాజా, సీటీవో జంక్షన్, బ్రూక్ బాండ్ జంక్షన్, టివోలి జంక్షన్, స్వీకార్ ఉపకార్ జంక్షన్, సికింద్రాబాద్ క్లబ్, త్రిముల్ ఘేరీ ఎక్స్‌రోడ్డు, తాడ్‌బండ్ ఎక్స్‌రోడ్డు, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, రసూల్‌పురా బేగంపేట, ప్యారడైజ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని అడిషనల్ సీపీ తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేయాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి అన్ని శాఖల అధికారులు నియామకాలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ .వెంకటాచారి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలలో టీజీపీఎస్సీ, గ్రూప్-4 ద్వారా నూతనంగా జిల్లాలో ఎంపికైన అభ్యర్థుల నియామకాలపై శాఖల వారీగా సమీక్షించారు. జిల్లాలో వివిధశాఖలలో గల 1059 జూనియర్ అసిస్టెంట్, ఇతర పోస్టులకు అభ్యర్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారని, వారికి డిసెంబరు 4న సీఎం చేతులమీదుగా పెద్దపల్లి జిల్లాలో ఉద్యోగ నియామక పత్రాలు అందచేస్తామన్నారు. ఉద్యోగ నియామక పత్రాల సిద్ధంతో పాటు అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు.

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అధికారుల తనిఖీలు

- నిబంధనలు పాటించని వారికి నోటీసులు


హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద తనిఖీలు చేస్తున్న జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌సెంటర్లలో నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీచేశారు. చాదర్‌ఘాట్‌లో సవేరా హోటల్‌లో అపరిశుభ్రమైన ఫ్లోరింగ్, మలక్‌పేటలో కోహిర్స్ అల్లం వెల్లుల్లి యూనిట్‌లో లేబుల్ లేని ప్యాకెట్లు గుర్తించారు. సలీంనగర్‌లో ఓ బేకరిలో కేకులపై వాడే పేస్టీల తయారీ తేదీలు, వినియోగ తేదీలను ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. చిక్కడపల్లి ప్రజ్ఞాభవన్ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న భోజన ప్రాంతం, అశోక్‌నగర్‌లో స్పైసీ నూడిల్ హౌస్, గాంధీనగర్‌లో మసాలాల్లో రంగులు, మహదేవ్ ఫుడ్‌కోర్టులో గడువు ముగిసిన మసాలాలు, సింథటిక్ రంగులు గుర్తించిన అధికారులు వారికి నోటీసులు జారీచేశారు. నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల చర్యలపై హర్షం

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకోవడంపై మాదిగ, ఎస్సీ ఉపకులాల సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. వర్గీకరణ తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయా సంఘాలన్నీ కృతజ్ఞతలు తెలిపాయి. ఫైనాన్స్ కమిషన్‌చైర్మన్, సర్వీస్‌కమిషన్ మెంబర్, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్, రెండు వైస్‌చాన్స్‌లర్ పదవులు, విద్యా కమిషన్ సలహామండలి సభ్యులుగా తమ కులాల వారికి అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక కార్యదర్శి కృపాకర్ మాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అసాంఘిక శక్తులను కట్టడి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అంబికానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా డివిజన్ అంబికానగర్ వీధిలో రూ.3.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్తీవాసుల కోరిక మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించానన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఏతి తేజోవంత్, బీజేపీ నాయకులు ఇ.సుమన్‌కుమార్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.ప్రేమ్‌రాజ్, బి.రమేశ్‌యాదవ్, బస్తీవాసులు బాలాజీ, శివాజీ, బండారి, ఎం.విలాస్ తదితరులు పాల్గొన్నారు.


శంభుప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమలాసన్‌రెడ్డి, ఇతర అధికారులు

42 ఏళ్ల సర్వీస్ అధికారిని ఇక్కడే చూస్తున్నా..

హైదరాబాద్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 42 సంవత్సరాల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగిన అధికారిని చూడడం నా సర్వీస్‌లో ఇదే మొదటిసారి అంటూ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ.కమలాసన్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ కమిషనర్ (కంప్యూటర్స్)గా పనిచేసిన శంభుప్రసాద్ ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని శనివారం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో ఆఫీసర్ల సంఘం ఘనంగా నిర్వహించింది. ఆయన ఖగోళశాస్త్రంలో మరింత పైకి రావాలని డైరెక్టర్ ఆకాంక్షించారు. శంభుప్రసాద్ సేవలపై అడిషనల్ డైరెక్టర్ అజయ్‌రావు, జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబీ.శాస్త్రి, సురేష్ ఇతరులు మాట్లాడారు. శంభుప్రసాద్, భాగ్యలక్ష్మి దంపతులను సన్మానించి వారికి మోమెంటోను అందించారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- 14న జాతీయ లోక్ అదాలత్
- ఉస్మానియాలో 2, 3, 9, 10 తేదీల్లో మెడికల్ బోర్డు
- గాయాలైన వారికి ధ్రువీకరణ పత్రాల జారీ
- సివిల్ కోర్టు జడ్జి రేణుక యార



సమావేశంలో మాట్లాడుతున్న సిటీసివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ రేణుక యార

చార్మినార్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుంటే సమయం డబ్బు ఆదా అవుతుందని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ రేణుక యార అన్నారు. శనివారం సిటీ సివిల్ కోర్టులోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యాక్సిడెంట్ కేసులు, సివిల్, ఇతర కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 14న నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి కక్షీదారుడు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం మార్చి, జూన్ అలాగే సెప్టెంబర్‌లో యాక్సిడెంట్, సివిల్ కేసులు అలాగే ఇతర కేసులు 1,643 పరిష్కరించి సంబంధిత కక్షీదారులకు వంద కోట్లకు పైగా నష్ట పరిహారం అందించామన్నారు. అదేవిధంగా బ్యాంక్ కేసులు 8,207కు గాను రూ. 21.47 లక్షలకు పైగా కక్షీదారులకు లబ్ధిచేకూర్చామన్నారు. వివిధ ప్రమాదాల్లో చనిపోయిన వారి కేసులు సత్వరమే పరిష్కారం అవుతుండగా అలాగే ప్రమాదాల్లో గాయపడిన వారికి ఉస్మానియా ఆర్థో విభాగంలో ఉస్మానియా ఆసుపత్రి మెడికల్ బోర్డును ఏర్పాటు చేశామన్నారు.

ప్రమాదాల్లో గాయపడిన వారికి డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో మెడికల్ బోర్డు అంగవైకల్యం ఉన్న వారి అర్హత మేరకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారన్నారు. తదుపరి కక్షీదారులకు నష్ట పరిహారం ద్వారా సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి సత్వరమే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. దీనికి ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా అంగీకరించయని తెలిపారు. యాక్సిడెంట్ కేసుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర ఉన్నతాధికారులను జడ్జి అభినందించారు. రాజీ మార్గం ద్వారా తమ కేసులను కక్షీదారులు పరిష్కారం చేసుకోవాలని జడ్జి తెలిపారు. న్యాయవాదులు మెడికల్ బోర్డు కంటిన్యూగా పనిచేసేలా వారంలో ఒక్కసారైనా పరీక్షలు చేసేలా ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కోరాలని న్యాయవాదులు చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలి

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్


ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కృష్ణస్వరూప్

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342 కు వ్యతిరేకంగా ఈ తీర్పు వచ్చిందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ వీఎల్.రాజు ఆధ్వర్యంలో వర్గీకరణ వద్దు - రాజ్యాధికారం కావాలని - ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 7 నుంచి జనవరి 26 వరకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వెంకట్రావ్, సీహెచ్.రోజాలీల, గవ్వల శ్రీకాంత్, పబ్బతి శ్రీకృష్ణ, సి.రాజలింగం, జేఎన్.రావు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్

విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం అవసరం : డీసీపీ

మదీన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. కిషన్‌బాగ్‌లోని గురునానక్ హైస్కూల్ యానువల్ స్పోర్ట్స్ డే ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వం అవసరమని, ఈ రెండూ ఉన్నప్పుడే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా సమాజంలో గుర్తింపు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, సిక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రీతమ్‌సింగ్, ఉపాధ్యక్షుడు ఎస్.బహదర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.దర్శన్‌సింగ్, జాయింట్ సెక్రెటరీ ఎస్.ఇక్బాల్ సింగ్, గురుద్వారా సాహెబ్ బరంబల అధ్యక్షుడు ఎస్.చేతన్ సింగ్ షికారి, పాఠశాల సెక్రెటరీ ఎస్.సజ్జన్‌సింగ్, ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాంబాగ్ దేవాలయాల భూములను కాపాడాలి


రాంబాగ్‌లోని శ్రీఅనంత పద్మనాభ స్వామి దేవాలయం ముఖద్వారం

రాజేంద్రనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాంబాగ్ దేవాలయ భూములను కాపాడాలని స్థానిక భక్తులు కోరుతున్నారు. నిజాం నవాబుల కాలంలో మంత్రులుగా పనిచేసిన అక్కన్నమాదన్నలు రాంబాగ్‌లో పలు దేవాలయాలను నిర్మించారని చెబుతారు. రాంబాగ్‌లో శ్రీరామచంద్రస్వామి దేవాలయం, అనంత పద్మనాభ స్వామి దేవాలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం, శ్రీచిన్న అనంతగిరి శివాలయం, సూర్య చంద్రుల దేవాలయం ఉన్నాయి. అయితే ఇక్కడ ఉన్న దేవాలయాల భూములు కబ్జా కోరల్లో ఉన్నాయి. దేవాలయ చాలా ప్రాంగణాలు లీజుల పేరుతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. దేవాదాయ శాఖ అధికారులు రాంబాగ్ దేవాలయాల స్థలాలను కాపాడటానికి సర్వే చేసి ప్రహరీ నిర్మించి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇటీవల శ్రీఅనంత పద్మనాభస్వామి దేవాలయ స్థలాలను తాము కొనుగోలు చేశామని కొందరు ప్రహరీని కూల్చి గేటు పెట్టడానికి ప్రయత్నించారని గుర్తు చేస్తున్నారు. దేవాలయాల స్థలాలు ప్రైవేటు వ్యక్తులకు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని, అలా కాకుండా దేవాలయాల భూములు ఎన్ని ఉన్నాయో.. తెలుసుకుని వాటి చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి కాపాడాలని స్థానిక భక్తులు కోరుతున్నారు.


ప్రథమ బహుమతిని బి.పల్లవికి అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

వైజ్ఞానిక ప్రదర్శనలో బుద్వేల్ హైస్కూల్ ఫస్ట్

రాజేంద్రనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి వచ్చింది. ఈ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.పల్లవి చేసిన నేచురల్ ఫార్మింగ్ (ప్రకృతి వ్యవసాయం)కు జిల్లా స్థాయిలో ఈ బహుమతి లభించింది. ఈ ప్రదర్శన ను తిరిగి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించడానికి అవకాశం దక్కింది. ఈ ప్రదర్శనను చేయడానికి బి.పల్లవిని గైడ్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు వి.అంజనేయులు అభినందించారు. సంతోషంగా ఉందని బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి తెలిపారు.


ప్రదర్శనలను తిలకిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ ఈవీఎస్ఎస్‌కే బాబు

ప్రతిభ వెలికితీతకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదం

మంగళ్‌హాట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని సీఎస్ఐఆర్- ఎన్‌జీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ ఈవీఎస్ఎస్‌కే బాబు అన్నారు. శనివారం ఆబిడ్స్‌లోని ఓ హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సైన్స్, క్రీడలు, కమ్యూనికేషన్‌స్కిల్స్‌లో రాణించాలన్నారు.

పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్ నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీకి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి మంజూరైన 1.43కోట్ల నిధులతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులకు శనివారం రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, వై.అమరేందర్‌రెడ్డి, దేపా భాస్కర్ రెడ్డి, యూసుఫ్ ఖాద్రి, జహంగీర్, జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్‌రామ్, చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్‌చైర్మన్ ఫర్హానా యూసుఫ్ పటేల్, బుడుమల యాదగిరి, లక్ష్మీనారాయణ, శంకర్, అఫ్జల్, కృష్ణారెడ్డి, షర్ఫుద్దీన్ హమీద్ తదితరులు పాల్గొన్నారు,

'జోగులాంబ ఆలయ ప్రధాన అర్చకుడిని సస్పెండ్ చేయాలి'


అఫ్జల్‌గంజ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లంపూర్ జోగులాంబ శక్తిపీఠం ఆలయ ప్రధానఅర్చకుడు ఆనంద్‌శర్మను సస్పెండ్ చేయాలంటూ జోగులాంబ ఆలయ అర్చకులు డిమాండ్ చేశారు. శనివారం బొగ్గులకుంటలోని ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం ముందు వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆనంద్ శర్మ ప్రధాన అర్చకుడిగా ఉంటూ ఆలయ ప్రతిష్టను మంటగలిపే విధంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఆయనను సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో చలోఅల్లంపూర్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని పలు సంఘాలనేతలు అన్నారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి మాల, మాదిగల మధ్య వివాదాలను తొలగించాలని వారన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

కౌలురైతుల ఊసేలేని రైతుపండగ

- 4న ఇందిరాపార్కు వద్ద ప్రజాదర్బార్, ఘహాధర్నా: సంయుక్త కిసాన్‌మోర్చా


రైతు సంఘాల ప్రజాదర్బార్, ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంయుక్త కిసాన్‌మోర్చా ప్రతినిధులు

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు పండగలో కౌలురైతుల ఊసేలేదని పలు రైతు సంఘాల నేతలు ఆరోపించారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూఆధీకృత సాగుదారుల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విస్సా కిరణ్ (రైతు స్వరాజ్య వేదిక), టి.సాగర్ (తెలంగాణ రైతు సంఘం), ప్రభులింగం (తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం), వి.ప్రభాకర్ (ఏఐపీకేఎస్), వెంకట్రాములు (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం), జక్కుల వెంకటయ్య (తెలంగాణ రైతాంగ సమితి) తదితరులు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, దీనిని తక్షణమే అమలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కౌలు రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్, ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.కొండల్, శేఖర్, శివుడు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yux2FCHలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ముస్లిం జనాభాకు అనుగుణంగా 'స్థానిక' రిజర్వేషన్లు అమలుచేయాలి : ఎంపీజే


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీజే నాయకులు

మదీన, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముస్లిం జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఎంపీజే రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఖాసింతో కలిసి శనివారం బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సర్పంచ్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ముస్లింలకు వారి జనాభా దామాషాప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలని కోరారు. స్పందించిన చైర్మన్ జి.నిరంజన్ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని హామీ ఇచ్చారని అబ్దుల్ అజీజ్ తెలిపారు.

శ్రీశైలం లెఫ్ట్ కెనాల్‌ను అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది ఫజల్ రేహ్మాన్

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుంకిశాల ప్రాజెక్ట్ వద్దు, శ్రీశైలం లెఫ్ట్ కెనాల్‌ను అభివృద్ధి చేయాలని హైకోర్టు న్యాయవాది ఫజల్ రేహ్మాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2021లో అప్పటి ప్రభుత్వం సుంకిశాల టన్నెల్ నిర్మాణానికి ముందుగా రూ.1400 కోట్లు కేటాయించగా అది రూ.2,200 కోట్లకు పెరిగిందని ఆరోపించారు. గత ఆగస్టు 2న సుంకిశాల మిడిల్ టన్నెల్ కూలిపోవడానికి బాధ్యులైన ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రవికుమార్, సీజీఎం డి.సుదర్శన్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ప్రాజెక్టును నల్గొండ జిల్లాకు చెందిన చాలామంది వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ కెనాల్ పనులను ఇరిగేషన్ శాఖకు అప్పగించాలన్నారు.

జానపద కళలను ప్రోత్సహించడం అభినందనీయం


కళాకారులను సత్కరిస్తున్న రమణాచారి

రవీంద్రభారతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలైన జానపద కళలను. కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్, ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కేవీ.రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సాంస్కృతి బంధు సారిపల్లి కొండలరావు సారథ్యంలో యువకళావాహిని, జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వందమంది జానపద కళాకారులకు నగదు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి జానపద కళాకారులను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, వెన్నెల గద్దర్, మామిడి హరికృష్ణ, పారుపూడి మురళీకృష్ణ, లంక లక్ష్మీనారాయణ, వంగా వీ.శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివమ్మకు స్నేహలత మురళి స్మారక పురస్కారం

జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా జానపద కళాకారిణి స్నేహలతమురళి స్మారక పురస్కారం ప్రదానోత్సవం నిర్వహించారు. జానపదకళాకారిణి సదుల శివమ్మకు పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూ.10వేల నగదు, శాలువా, మెమెంటోతో సత్కరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

'సిరివెన్నెల తొలిగురువు సమ్మాన్యుడు కొత్తగా..' ఆవిష్కరణ

రవీంద్రభారతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంగీత ప్రపంచంలో సిరివెన్నెల పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని విశ్రాంత ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో అక్షజ్ఞ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో చేంబోలు శ్రీరామశాస్త్రి రచించిన సిరివెన్నెల తొలిగురువు సమ్మాన్యుడు కొత్తగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్వీ సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిను అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యారావు మాస్టారు, ఎంవీఆర్.శాస్త్రి, గుండు వల్లీశ్వర్, పన్నాల కృష్ణ సుబ్రహ్మణ్యం, కిరణ్ ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జానకమ్మ స్వరవైభవం

రవీంద్రభారతి: సారస్వత పరిషత్‌లో ప్రాజ్ఞికఫౌండేషన్, ప్రాజ్ఞిక ఆర్ట్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జానకమ్మ స్వరవైభవం శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రఖ్యాత గాయనీమణి జానకి ఆలపించిన గీతాలతో గాయనీగాయకులు అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగీత దర్శకుడు కేఎం.రాధాకృష్ణ, గౌరవఅతిథిగా సురేఖామూర్తి, అఖిల, సింహ, రామ్‌కీ, ప్రవీణ్ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించారు.

పీసీసీ లీగల్ హెచ్ఆర్, ఆర్టీఐ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది శారద నేనావత్

చార్మినార్, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది శారద నేనావత్ నియమితులయ్యారు. ఈ మేరకుటీ పీసీసీ లీగల్ హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్టీఐ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శనివారం తన కార్యాలయంలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శారద నేనావత్ సేవలను గుర్తించి నియమించినట్లు ఆయన తెలిపారు.

నేడు సీపీఐ నేత బాలమల్లేశ్ సంతాప సభ



రాజేంద్రనగర్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ శనివారం గుండెపోటుతో దుర్మరణం చెందారు. ఆయన రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రాజేంద్రనగర్ తో బాలమల్లేశ్‌కు అవినాభావ సంబంధం ఉంది. సీపీఐ రాజేంద్రనగర్ మండల కమిటీ చేపట్టే కార్యక్రమాలలో ఆయన చురుకుగా పాల్గొనేవారు. బాల మల్లేశ్ మృతికి ఆ పార్టీతోపాటు వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం బుద్వేల్‌లోని రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యాలయంలో బాలమల్లేశ్ సంతాప సభను నిర్వహిస్తామని వారు తెలిపారు.

విద్యాశాఖ లీకులపై కలెక్టర్ సీరియస్..!

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ కౌన్సెలింగ్‌లో అవకతవకలకు పాల్పడిన డిప్యూటీ ఈవో, డీఐఓఎస్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఈఓకు తాను జారీచేసిన ఆదేశాలు లీక్ కావడంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. లిఖిత పూర్వక ఉత్తర్వులు వెలువడకముందే ఆదేశాలు బయటకు రావడం ఏమిటని ఏకంగా ఓ ఉన్నతాధికారిపై సీరియస్ కావడం చర్చనీయాంశంగా మారింది. డీఎస్సీ పోస్టింగుల్లో ఖాళీలను సరిగా చూపించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక డిప్యూటీ ఈఓ, ఆరుగురు డీఐఓఎస్‌లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.. డీఈఓకు రెండు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం శనివారం పత్రికల్లో రావడంతో పాటు డిప్యూటీ ఈఓలు, డీఐఓఎస్‌లందరూ ప్రభుత్వ మోడల్ ఆలియా స్కూల్‌లో సమావేశమై కలెక్టర్‌ను కలిసే విషయంపై చర్చించుకోవడం బహిర్గతమైంది. ఈ అంశాని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్.. ఉన్నతాధికారిని మందలించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, అధికార పార్టీకి అనుబంధంగల ఓ ఉపాధ్యాయ సంఘం బాధ్యుడి ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ ఈవోలు, డీఐఓఎస్‌లందరూ మధ్యాహ్నం కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వారు కలువలేకపోయారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్య పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని సదరు బాధ్యుడు వారికి భరోసా కల్పించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, సదరు బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తక్షణమే ఆర్‌జేడీకి సిఫారసు చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించినట్లు తెలిసింది.

ఒడిశా నుంచి నగరానికి ఆమ్‌ఫెటమైన్ డ్రగ్

● రూ.20లక్షల సరుకు స్వాధీనం

● దంపతులు సహా 13మంది అరెస్ట్



పోలీసులకు చిక్కిన దంపతులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి నగరానికి వచ్చి ఆమ్‌ఫెటమైన్ డ్రగ్స్‌ను విక్రయిస్తున్న దంపతులను బేగంపేట పోలీసులతో కలిసి సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారితో పాటు.. డ్రగ్స్ కొనుగోలు చేసిన మరో 11 మంది వినియోగదారులనూ అదుపులోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అతీఫ్ అస్లాం ఖాన్, సుభానీ బేగం దంపతులు ఒడిశా నంచి నగరానికి వచ్చి ప్రకాష్‌నగర్‌లో ఒక ఇల్లును అద్దెకు తీసుకున్నారు. వారు ఒడిశానుంచి తెచ్చిన 300 గ్రాముల ఆమ్‌ఫెటమైన్ డ్రగ్‌ను చిన్న మోతాదుల్లో ప్యాకింగ్ చేశారు. అప్పటికే నగరంలోని ఉన్న కస్టమర్స్‌ను సంప్రదించి డ్రగ్‌ను విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య టీమ్ నిఘా పెట్టి బేగంపేట పోలీసులతో కలిసి అతిఫ్ అస్లాం దంపతులను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో 11మంది వినియోగదారులు పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి 250 గ్రాముల డ్రగ్‌ను, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సరుకు విలువ రూ.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ధర్మపురిక్షేత్రంలో రామరాజ్య స్థాపన విగ్రహావిష్కరణ

మియాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని శ్రీధర్మపురి క్షేత్రంలో ఆదివారం రామరాజ్య స్థాపన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారతీయం సత్యవాణి తెలిపారు. ఈ కార్యక్రమం ధర్మపురి క్షేత్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. శనివారం రామరాజ్య స్థాపన తీరు తెన్నులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామరాజ్యంలో అందరిని ఎలా కలుపుకోవాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ధర్మవిజయం పేరిట పండితులచే ముదిగొండ శివప్రసాద్ ఆధ్వర్యంలో కళాత్మక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాగ్దానాల అమలులో రేవంత్ సర్కారు విఫలం

● సీపీఐ(ఎం) తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ● సీపీఐ(ఎం) 23వ గ్రేటర్ హైదరాబాద్ మహాసభలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు మినహా మిగతా వాగ్దానాలు అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. సీపీఐ(ఎం) 23వ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ మహాసభలను శనివారం అమీర్‌పేటలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్లో తమ్మినేని వీరభద్రం ఎర్రజెండా ఆవిష్కరణతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అందిస్తామన్న రేవంత్ రెడ్డి, ఇవాళ కీలకమైన నిర్ణయాలలో ప్రజాభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదంటూ లగచర్ల, దిలావర్‌పూర్, దామగుండం తదితర ఘటనలను ఉదాహరించారు.

మతతత్వమనే బ్రహ్మరాక్షసిని ఓడించడానికి మాత్రమే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించాం, అంతకుమించి ఆ పార్టీ మీద తమకు ఎలాంటి విశ్వాసం లేదని ఆయన స్పష్టంచేశారు. సీఎం రేవంత్ కేంద్రం విధానాలను ఎందుకు సూటిగా విమర్శించడంలేదంటూ ప్రశ్నించారు. తన సీఎం పదవి కాపాడుకోడానికి అవసరమైతే రేవంత్‌రెడ్డి బీజేపీకి లొంగిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ సైతం మోదీ విధానాలపై ఎందుకు నోరుమెదపరని ఆయన నిలదీశారు. ఈ పరిస్థితుల్లో వామపక్షాల ఐక్యకార్యాచరణతో ముందుకు వెళ్లడంద్వారా మాత్రమే తెలంగాణను కాపాడుకోగలమని అన్నారు. ఎర్రజెండాపై ప్రజలకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రజాఉద్యమాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేద్దామని తమ్మినేని తమ పార్టీ కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఎన్వీ భాస్కరరావు సేవలు ఆదర్శనీయం

● బీవీ రాఘవులు, సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యుడు

సీపీఐ(ఎం) నగర మహాసభలు వేదికపై 'హైదరాబాద్ కార్మికోద్యమ దశ, దిశ మార్చిన ఎన్.వి భాస్కరరావు' పుస్తకాన్ని ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు బీవీ రాఘవులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ కార్మికోద్యమంలో రెండోతరం నాయకుల్లో ప్రముఖులు ఎన్.వి.భాస్కరరావు ఒక విశిష్టమైన ట్రేడ్ యూనియనిస్టు అని కొనియాడారు. భాస్కరరావు పోరాట జీవితంపై వెలువడిన పుస్తకాన్ని కార్యకర్తలంతా చదవాలి అని సూచించారు. ఈ పుస్తకాన్ని తీసుకొచ్చిన భాస్కరరావు కుమార్తెలు శ్యామల, నిర్మల, ప్రమీలను అభినందించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మాజీ కార్యదర్శి రఘుపాల్, పీఎస్ఎన్.మూర్తి, మోతుకూరి నరహరి, సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా ఆదివారం తమ పార్టీ నగర నూతన కార్యవర్గంతో పాటు పలు తీర్మానాలను ప్రకటించనున్నట్లు ఎం. శ్రీనివాస్ తెలిపారు.

గురుకులాలు, హాస్టళ్లలో సంస్కరణలు చేపట్టాలి

సీఎంకు లేఖ రాసిన ఆర్.కృష్ణయ్య

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, హాస్టళ్లపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి సంస్కరణలు చేపట్టాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం పలు అంశాలతో కూడిన లేఖను సీఎం రేవంత్‌రెడ్డికి రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో 42మంది విద్యార్థులు చనిపోయారని, దాదాపు 1200 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలయ్యారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2008లో ఉమ్మడి రాష్ట్రంలో 300 బీసీ బాలికల హాస్టల్స్, 2010లో 300 బీసీ బాలుర హాస్టల్స్ మంజూరు చేసిందన్నారు. ఈ హాస్టళ్ల ఇంతవరకు నిర్దిష్టమైన, పటిష్టమైన పాలనావిధానం రూపొందించలేదన్నారు. బీసీ హాస్టళ్లలో వర్కర్లను శాశ్వత ప్రాతిపదికతో పాటు ప్రతి హాస్టల్స్‌కు నలుగురు శాశ్వత వర్కర్స్‌ను నియమించాలని, అటెండర్, వాచ్‌మన్, కామటి, కుక్‌లను నియమించాలన్నారు. హాస్టల్‌లో 150మంది విద్యార్థుల కంటే ఎక్కువ సంఖ్య ఉన్న చోట ప్రతి 25 మందికి ఒక వర్కర్‌ను అదానంగా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులకు ముగ్గురు వర్కర్లు ఉన్నారని, దీంతో హాస్టల్‌లో పరిశుభ్రత దెబ్బతింటుందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కాలేజీల్లో డ్రగ్స్ వినియోగంపై కన్నేయండి

సందీప్‌కుమార్ శాండిల్య

హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జూనియర్ కాలేజీల్లో డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్‌కుమార్ శాండిల్య కోరారు. శనివారం ఇంటర్‌బోర్డు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రహరీ, పరిశోధన ల్యాబ్‌లు తప్పనిసరిగా ఉండాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14416పై ప్రచారం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కోరారు.

విద్యార్థినులను వేధిస్తున్న లెక్చరర్‌పై కేసు నమోదు

మియాపూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న లెక్చరర్‌పై విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు పేర్కొన్న వివరాల ప్రకారం... మియాపూర్ మదీనగూడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యార్థినులతో తరగతి గదిలో, సామాజిక మాధ్యమంలో కెమిస్ట్రీ లెక్చరర్ హరీష్ అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా డబుల్ మీనింగ్ డైలాగ్‌లతో కొన్ని రోజులుగా వేధిస్తున్నాడు. తనకు సహకరిస్తే ఎక్కువ మార్కులు వేస్తానని, లేదంటే యాసిడ్‌తో దాడి చేస్తానని బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రచయిత నందివాడ భీమారావు కన్నుమూత



నందివాడ భీమారావు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రంజని తెలుగు సాహితీ సమితి వ్యవస్థాపకుల్లో ముఖ్యులు, సీనియర్ రచయిత నందివాడ భీమారావు(93) ఇకలేరు. ఆయన శుక్రవారం రాత్రి 9.40గంటలకు మియాపూర్‌లోని స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. భీమారావు తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలులో 1931, నవంబరు 30న జన్మించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం, బీఎస్సీ హానర్స్‌లో బంగారు పతకం సాధించారు. 'ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీస్' అధికారిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన భీమారావు శ్రీశైలం ప్రాజెక్టు ఫైనాన్షియల్ డైరెక్టర్‌గా సేవలందించారు. హైదరాబాద్ అకౌంటెంట్ జనరల్(ఏజీ) కార్యాలయంలో ఆడిట్ బోర్డు మెంబర్, ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా 1989లో ఉద్యోగ విరమణ పొందారు. సాహిత్యాభిలాష కలిగిన ఆయన కొన్ని కథలు, 'తోరణం', 'కన్నీరు పన్నీరు' తదితర నవలలు, తన భార్య శ్యామలతో కలిసి 'కదిలే మబ్బులు కదలని కొండలు' ఆత్మకథాత్మక నవల, 'ఆర్ట్ ఆఫ్ ది ఇంపాజిబుల్' ఆంగ్ల రచన చేశారు. తన భార్య స్మారకంగా ప్రతి ఏటా అస్తిత్వవాద రచయిత్రులకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. నందివాడ భీమారావు కథలపోటీల పేరుతో ఎంతోమంది ఔత్సాహిక, యువ కథకులను ప్రోత్సహిస్తున్నారు. రంజని తెలుగు సాహితీ సమితి వ్యవస్థాపకుల్లో ముఖ్యుడిగా భీమారావు తెలుగు సాహిత్య రంగానికి విశిష్టసేవలు అందించారని ఆ సంస్థ ప్రతినిధులు గుర్తుచేసుకొన్నారు. భీమారావు కుమార్తె ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞురాలు రత్నశ్రీ కరోనా కాలంలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం చిన్నకుమార్తె నాగమణి దగ్గర ఉంటున్నారు. కుమారులు ఉదయ్ భాస్కర్ అమెరికా, సోమశేఖర్ కెనడాలో స్థిరపడ్డారు. వారు మంగళవారం ఉదయానికి నగరానికి చేరుకోనున్నట్టు సమాచారం. నందివాడ భీమారావు తుదికోరిక మేరకు డిసెంబరు 3న మధ్యాహ్నం బాచుపల్లిలోని మమతా వైద్యకళాశాలకు ఆయన భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనార్థం అప్పగించనున్నట్లు కుమార్తె నాగమణి తెలిపారు. రచయితలు సుధామ, ఎం.వెంకటరమణ, ఆద్యకళ కన్వీనర్ జయధీర్ తిరుమలరావు తదితరులు సంతాపం ప్రకటించారు.

పబ్‌లో సన్నీలియోన్ ఈవెంట్ రద్దు

అనుమతులు లేవని అడ్డుకున్న పోలీసులు



పబ్ వద్ద పోలీసుల బందోబస్తు

బంజారాహిల్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ హీరోయిన్ సన్నీలియోన్ ఈవెంట్ రద్దయ్యింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10 ఎల్యూషన్ పబ్‌లో వీకెండ్ సందర్భంగా శనివారం నటి సన్నీలియోన్ డీజేను ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుక్ మై షో ద్వారా సుమారు 500 మందికి టికెట్లు విక్రయించారు. శుక్రవారం విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఈవెంట్ నిర్వాహకులను పిలిచి అనుమతులు తీసుకోనందున ఈవెంట్ నిర్వహించొద్దని చెప్పారు. అయినప్పటికీ నిర్వాహకులు శనివారం సన్నీలియోన్‌ను నగరానికి రప్పించారు. దీంతో ఆమె పబ్‌కు వస్తే తిప్పి పంపించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పబ్ నిర్వాహకులు చేసేది లేక చివరి నిమిషంలో ఈవెంట్‌ను రద్దు చేశారు. దీంతో టికెట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళనకు దిగారు.

గుర్తింపే లేదు.. సర్టిఫికెట్ ఎలా?

(5వ పేజీ తరువాయి)

ఏడాది తరగతులు కూడా ప్రారంభించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కానీ, గత ప్రభుత్వం కానీ యూజీసీ గుర్తింపు కోసం చర్యలు చేపట్టలేదు. మహిళా యూనివర్సిటీని ప్రకటించినప్పుడే రాష్ట్ర అసెంబ్లీలో సంబంధిత చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలి. గవర్నర్ ఆమోదం కూడా లభించిన తర్వాత యూజీసీకి అందజేయాలి. యూజీసీ కమిటీ పరిశీలన తర్వాత అనుమతి లభిస్తుంది.

నాటి నుంచి కాలయాపనే..

పలు ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతులిస్తూ గత ప్రభుత్వం అసెంబ్లీలో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించింది. కానీ మహిళా విశ్వవిద్యాలయం బిల్లు విషయంలో కాలయాపన చేసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతో హర్షం వ్యక్తమైంది. కానీ, యూజీసీ గుర్తింపు లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మొదటి బ్యాచ్ పీజీ విద్యార్థుల చదువు పూర్తయినా వారికి సర్టిఫికెట్లను జారీ చేసే అర్హత మహిళా యూనివర్సిటీకి లేకుండా పోయింది. మొదటి బ్యాచ్ డిగ్రీ విద్యార్థులకు వచ్చే ఏడాది మే నెలలో కోర్సు పూర్తవుతుంది. వారికీ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంటుంది. కోఠి ఉమెన్స్ కాలేజీ.. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగిన నేపథ్యంలో దాని అధికారులైనా సర్టిఫికెట్ల జారీకి అంగీకరించడం లేదు. దీంతో తమ భవిష్యత్తు అయోమయంగా మారిందని విద్యార్థినులు పేర్కొంటున్నారు. కాగా, ఈ వర్సిటీ చట్ట సవరణ ముసాయిదా బిల్లును ఉన్నతవిద్యామండలి ద్వారా ప్రభుత్వానికి అందజేశామని వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తెలిపారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని, ఆ తర్వాత యూజీసీ అనుమతి కోసం చర్యలు చేపడతామని చెప్పారు.

సైకిల్.. తొక్కితే లాభాల్

(5వ పేజీ తరువాయి) వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో అక్కడి పౌరులు శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడానికి, వాయు, శబ్దకాలుష్యాన్ని తగ్గించేందుకు తరచూ సైకిళ్లపైనే ఆఫీసులకు, వివిధ ప్రదేశాలకు వెళ్తుంటారు. ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ యువత సైక్లింగ్ పట్ల మక్కువ పెంచుకుంటోంది. ప్రధానంగా వారాంతాలు, సెలవురోజుల్లో వినియోగిస్తున్నారు. వారంలో ఒకరోజు సొంత వాహనాన్ని పక్కనబెట్టి సైకిల్‌పై ఆఫీసుకెళితే పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి అవకాశం ఏర్పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వాలు అవగాహన కల్పించి ప్రతీ ప్రాంతంలో సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మక్కువ పెంచుకుంటున్న యువత

సైక్లింగ్ పట్ల నగర యువత ఇప్పుడిపుడే శ్రద్ధ చూపుతోంది. రక్షణశాఖ, పోలీసు అధికారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇంజనీర్లు, లాయర్లు, వైద్యులు, వ్యాపారులు సైకిల్ తొక్కడానికి ఇష్టపడుతున్నారు. అల్వాల్, తిరుమలగిరి, మిలటరీ రహదారుల్లో వారాంతాల్లో మహిళలు, యువకులు పెద్దఎత్తున సైక్లింగ్ చేస్తుంటారు.

గృహజ్యోతి లబ్ధిదారులు 10.5 లక్షలు

(5వ పేజీ తరువాయి)

1.15 లక్షలమంది లబ్ధి పొందుతున్నారు. అత్యల్పంగా బంజారాహిల్స్ సర్కిల్‌లో 36 వేలు, హైదరాబాద్ సెంట్రల్‌లో 68 వేలు, సికింద్రాబాద్‌లో 70 వేలు, సైబర్‌సిటీలో 73 వేలు, హైదరాబాద్ సౌత్‌లో 98 వేలమంది లబ్ధి పొందుతున్నారు. మార్చి నుంచి నవంబరు నాటికి హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో అత్యధికంగా 54 శాతం గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య పెరగ్గా, రాజేంద్రనగర్‌లో 31.06, సరూర్‌నగర్‌లో 22.89 శాతం పెరిగింది.

గ్రేటర్‌లో గృహజ్యోతి లబ్ధిదారుల లెక్క

సర్కిల్	మార్చి	నవంబరు	పెరుగుదల (శాతం)
బంజారాహిల్స్	31,571	36,657	16.10
సైబర్‌సిటీ	63,298	73,502	16.12
హబ్సిగూడ	1,12,759	1,28,680	14.12
హైదరాబాద్ సెంట్రల్	56,636	68,010	20.08
హైదరాబాద్ సౌత్	63,895	98,441	54.07
మేడ్చల్	1,06,133	1,15,982	9.28
రాజేంద్రనగర్	1,01,487	1,33,013	31.06
సంగారెడ్డి	1,80,540	2,13,016	17.99
సరూర్‌నగర్	93,100	1,14,410	22.89
సికింద్రాబాద్	62,419	70,721	13.30
మొత్తం	8,71,841	10,52,432	20.71